





అప్పిగాడి నోట్లో బీడీ ఎర్రగాకాల్తోంది.

అంతకంటే ఎర్రగా జ్యోతుల్లా కాల్తున్నాయి వాడి కళ్ళు. నోటి నిండా పీల్చి గుప్పు గుప్పుమని వదుల్తున్నాడు పొగ. అంతకన్నా ఎక్కువగా వాడి వళ్ళు కక్కుతోంది శగ. చిందర వందరగా పడివున్న వాడి దుబ్బులాటి జుట్టు. కనుబొమలు చిట్లించిన కారణంగా వాడి నుదుటగీతలు. పిడికిలి బిగించిన కారణంగా వుబ్బిన వాడి చేతి నరాలు, గాలికి రేగిన పంచె.

ముడుచుకు కూచున్న కారణంగా, వాడి పాదాల తాకిడికి నేల నుంచి లేస్తున్న ఇసుక.

గుడిసెముందు ప్రవహిస్తున్న కాలవలో దోమలగోల. చుట్టు పక్క గుడిసెలోవారి పిల్లల గోల.

ఇవేవికూడా వాడి బుర్ర కెక్కలేదంటే. వాడెంత తీవ్రంగా ఆలోచిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు.

ఎదుటివాడి ఇల్లు, వళ్ళు ఎలా గుల్ల చేయాలనికాదు వాడాలోచించేది. ఎదుటివాడ్ని ఎలా పడగొట్టి తనెలా పైకి లేవాలనికాదు వ్వాడాలోచించేదీ. ఎదుటివాడు బాధతో గిలగిల తన్నుకుంటుంటె ఎలా నవ్వాలనికాదు వాడాలోచించేది.

మనిషి దేనికోసం చెయ్యరాని పనులు చేస్తాడో, దేనికోసం 'నా'అన్న వారందరినీ వదులుకోడానికి సిద్ధమవుతాడో దేని చేతుల్లో కీలుబొమ్మ అవుతాడో. దాని గురించి ఆలోచిస్తున్నాడు.

* * *

బీడీ అయిపోయి నోరు కాలింది.

'ఛీ' అని వుమ్మేశాడు.

ఇంతలో లచ్చి గుర్తుకొచ్చింది.

పిచ్చిది అయ్యని కూడా కాదని వచ్చింది.

ఆ రోజు ఆడికి బాగా గుర్తు.

లచ్చికి, ఆడికి మనువయిన మొదటి రాత్రి.

ఆళ్ళయ్యగారు పోయారని పిలిగా వొచ్చి చెప్తే, డప్పు తీసుకుని ఆడంట వెళ్ళిపోయాడు.

* * *

అర్ధరాత్రయిం తరువాత డప్పుశబ్దం లచ్చి నిద్ర పాడు చేసింది. డప్పుడు దగ్గరవ సాగింది.

నులక మంచం నుంచి లేచి తడిక కొంచెం ఎడంచేసి చూసింది లచ్చి.

డప్పు వాయిస్తూ, వగరుస్తూ ఎగురుతున్నాడు అప్పిగాడు,

గుడిసె దగ్గరకు రాగానే ఇంకా గట్టిగా డప్పు వాయిస్తూ, శివమెత్తినవాడిలా ఎగరసాగాడు.

శవం గుడిసె దాటింది.

లచ్చి తడికేసుకుంది.

శవం సాగి సాగి రత్తయ్య సారాకొట్టు ముందాగింది.

రత్తయ్య బయటికి చూశాడు.

అప్పిగాడు ఎగురుతున్నాడు డప్పు




వాయిస్తూ.

ఆయాసంతో వాడి గుండె బంతిలా ఎగిరెగిరి పడుతోంది.

వాడలా ఎగిరినప్పుడల్లా భూమిమీద పడుతున్న వాడి బలమైన అడుగు తన నెత్తిమీద పడి పాతాళానికి తొక్కుతున్నట్టుంది. గుండెమీద పడి, గుండె కాస్తా పిండయిపోతున్నట్టు అనిపించింది.

ఇంతలో ఎవరో మనిషొచ్చి సారా పట్టికెళ్ళాడు.

రత్తయ్య చూస్తుండగానే ఆ సారా అప్పిగాడి పొట్టలోకి జారిపోయింది.

ఆ సారాకాస్త విషంగా మారి ఆడ్ని చంపేస్తే బావుండు ననిపించింది రత్తయ్యకి.

రత్తయ్యని పాతాళానికి తొక్కుతూ, గుండె పిండిచేస్తూ, కదిలాడు అప్పిగాడు.

సిగ్నలివ్వగానే రైలు కదిలినట్టు, అప్పిగాడు కదలగానే వాడి అడుగుల్ని అనుసరించింది శవం.

తెల్లారు జామున గుడిసె చేరాడు అప్పిగాడు.

* * *

పగలు, రాత్రి నేనంటే నేనని వంతు లేసుకొచ్చాయి. లచ్చి ప్రసవించే రోజులు దగ్గరపడుతున్నాయి. వారం రోజుల్నించి అప్పిగాడేళ్ళు డప్పుమీద పడనట్లే. అంచేత నోట్లో సుక్క కూడా పడట్లే.

పిచ్చెక్కిపోతాంది అప్పిగాడికి.

కూడులేకుండా ఎన్నిరోజులయినా వుండగలడుగాని, నోట్లో సుక్క పడకుండా ఒక్క పూటకూడా వుండలేడు. అప్పిగాడ్ని భూమ్మీదేసిన కొన్ని క్షణాలకే వాడి తల్లి పైలోకం చేరింది. కొన్నేళ్ళ తరువాత ఆడి తల్లి దగ్గర కెళ్ళిపోయాడు తండ్రి.

అప్పట్నించి ఏ తోడు లేని అప్పిగాడికి సుక్క తోడయింది.

"సీ యవ్వ ఎవరూ సావరే" అని రోజుకి వందసార్లు అనుకున్నాడు. పాపాలు చేసేవాళ్ళు ఎక్కువ కాలం బతుకుతారని ఎవరో చెప్పగా విన్నాడు. అంచేత అంతా పాపాలు చేసేవాళ్ళని విసుక్కున్నాడు.

మనుషులకి ప్రాణప్రీతి చాలా ఎక్కువ. ఆఖరికి సముద్రంలో కొట్టుకుపోయేవాడు కూడా చిన్న పూచికపుల్లనయినా ఆధారం చేసుకుని బతికి బట్టకట్టా లనుకుంటాడు. అంతటి ప్రాణప్రీతివున్న ప్రాణాలు పోతేగాని అప్పిగాడులాంటి ప్రాణుల ప్రాణాలు నిలవవు. పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణ సంకటం అంటే ఇదే కామోసు.

* * *

డప్పు మీదేళ్ళు.

నోట్లో సుక్క పడి పదిరోజులవుతుంది అప్పిగాడికి.

లచ్చికి నొప్పులు రావటం ప్రారంభించాయి.

అప్పిగాడు తన కర్తవ్యాన్ని మరచిపోయాడేమో గుర్తు చేద్దామనుకున్నట్టుగా వస్తున్నాయి లచ్చికి నొప్పులు అప్పుడప్పుడు.

లచ్చికి ఆ రోజు నొప్పులు చాలా తీవ్రంగా వచ్చాయి.

గాభరాపడి, తనగుడిసెకి మూడు గుడిసెలవతలున్న ఓ నడివయసావిడ్ని పిల్చుకొచ్చాడు.

గుడిసె బయట కూచున్నాడు అప్పిగాడు.

ఇయాళన్నా ఎవరన్న సత్తే బావుండ్ను సత్తే బావుండ్ను.

పదే పదే అనుకున్నాడు మనసులో.

ఇంతలో, 'కెవ్వు' మని ఏడుపు వినిపించింది.

తామర పువ్వులా వికసించింది అప్పిగాడి ముఖం.

తరువాత ఏడుపాగిపోయింది.

వాడిన పువ్వులా ముడుచుకుపోయింది అప్పిగాడి ముఖం. క్షణం ఓ యుగంలా తోస్తాంది వాడికి.

కొన్ని యుగాలు గడిచాయి.

తడిక 'కిర్రు'మని చప్పుడు చేసింది.

పవిటకొంగు నోట్లో పెట్టుకుని ఓ నిముషం అప్పిగాడికేసి చూసి చకచకా సాగిపోయింది నడివయస్సావిడ. మొదటిసారిగా నోట్లో సుక్క డకుండా, డప్పు వాయించకుండా శవాల్ని కాటికి చేర్చాడు అప్పిగాడు.

